# అసుర సంతతి

## కప్పగంతుల మల్లికార్జునరావు

'అంకుల్'

చేతన అడగబోయే విషయం నాకు సగం అర్థం అయింది. రాస్తున్న కాగితాలను మడచి అవతల పెట్టి ఆమెను కూర్చోమని సౌంజ్ఞ చేసేను.

'నేను చంద్రశేఖర్ అనే వ్యక్తిని ప్రేమించాను. అతను కూడా నన్ను ప్రేమించాడు. చందూ వివరాలు, ఫోటో యివిగో...'

చేతన ఎవరినో ప్రేమించిందని నాకు చూచాయగా తెల్సు. అయితే చేతన వ్యక్తిత్వంపై నాకు సంపూర్ణ విశ్వాసం వుంది. అంచేత పట్టించుకోలేదు.

ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పం, దీక్ష, పట్టుదల, ఔరవ, నిగ్రహశక్తి యిలాంటి కొన్ని లక్షణాలతో పాటుగా భారతీయ మౌలిక విలువల పట్ల విశ్వాసం వున్న వ్యక్తి ఆమె.

చందూ ఫోటోను చూచాను. అందగాడే. కానీ నేను శరీర సౌందర్యానికన్నా మనో సౌందర్యానికి విలువనిచ్చే వ్యక్తిని.

అతడిని గురించి వివరాలు చదివేను వులిక్కిపడింది నా మనసు.

'ఏవేవో అనుమానాలు... సందేహాలు... ప్రశ్నలు?'

'నన్ను గురించిన వివరాలు కూడా చందూకు యివ్వాలి కదా అంకుల్? నేనెవరినో, నా తలిదండ్రులెవరో...'

'చెప్తానమ్మా. ఆ వివరాలు ఎప్పుడో నీకు చెప్పవల్సిన అవసరం వస్తుందని నాకు తెల్సు. కానీ ఆ వివరాలు చెప్పే ముందుగా నేనో కథ చెప్తాను. వింటావు కదా? అలా ఆ తలుపులు వేసి ఆ కుర్చీని నా దగ్గరిగా లాక్కొని కూర్చో.'

చైతన్య నేను చెప్పినట్లు చేసింది.

నేను కథను చెప్పటం ఆరంభించాను.

* * *

నేను నెలల బిడ్డగా వుండగానే నా కుడికాలు చచ్చుబడిపోయింది. అప్పటికింకా ఆ వ్యాధికి 'పోలియో' అన్న నామకరణం చేసేరో లేదో నాకు తెలియదు. కానీ చికిత్స పెద్దగా జరగలేదు.

నా కుంటితనాన్ని చూచి జాలిపడేవాళ్లను చూస్తే నాకు కోపం వచ్చేది. కుంటితనాన్ని జయించాలన్న పట్టుదల పెరిగేది.

పది సంవత్సరాల వయసులో నేను ప్రప్రథమంగా మా పెద్ద నాన్నతో కల్సి రైలు ప్రయాణం చేసేను. నేను ప్రయాణం చేసిన రైలును 'దయ్యాల బండి' అనేవారు. రాత్రి పూట అన్ని వూళ్లలో ఆగుతూ ప్రయాణం చేసే ఆ పాసెంజర్‌లో ప్రయాణం మొదట్లో సర్దాగా వున్నా, కాస్సేపయ్యాక నేను నిద్రపోయాను.

నాకు మెలుకువ వచ్చి చూసేసరికి మా రైలు పెట్టెలో జనం ఎవ్వరూ లేరు. నాకు భయం వేసింది. మా పెద నాన్న కోసం చూచాను. ఆయన కూడా కన్పించలేదు.

నేను మెల్లగా లేచి రైలు పెట్టెలో నుంచి బయిటకి చూచాను.

అంతా చీకటి.

ఆ చీకట్లోనే జనం వొక చోట గుమిగూడి వున్నారు.

ఏం జరిగింది? రైలుకేం ప్రమాదం కాలేదు కదా?

జనం అంతా రైలు యింజన్ వద్దనే వున్నట్లు నేను అప్పుడు గుర్తించాను.

నాకు వుత్కంఠ పెరింది. భయాన్ని మర్చిపోయాను.

రైలు దిగేను. గుంపు వైపు నడుస్తుండగా రైలు కూత వేసింది.

జనం చెల్లా చెదురుగా పరుగులెత్తి రైలుపెట్టెలు ఎక్కసాగేరు.

ఆ కంగారులో ఎవరో నన్ను అవతలకి తోసేరు. ప్రక్కనే వున్న వో తుప్ప మీద పడ్డాను నేను. ఆ తోసినవాడి మీద నాకు కోపం వచ్చింది.

రైలు మరోసారి కూత వేసి మెల్లగా కదిలింది. నాకు భయంతో, కోపంతో నోట మాట రాలేదు. పెద్దగా అరవాలని ప్రయత్నించాను. తుప్పలో నుంచి లేవాలని ప్రయత్నించాను. కానీ రెండూ సాధ్యం కాలేదు.

నా కళ్ల ఎదుటే రైలు మెల్లగా కదలిపోయింది.

రైలు నన్ను దాటి పోయాక నాకు లేచే శక్తి వచ్చింది.

లేచాను. అరుస్తూ కుంటి కాలు యీడ్చుకుంటూ రైలు వెనుక పరుగెత్తసాగేను.

అయితే చిత్రం! నేను పరుగెత్తే కొద్దీ, నాకు, రైలుకు దూరం పెరిగిపోయింది. క్రమంగా రైలు నాకు చాలా దూరమయింది.

ఏడుపు... కోపం... వుక్రోశం... అసహాయత...

కాళ్ల క్రింద వున్న కంకర రాయిని చేతిలోకి తీసుకొని రైలుకు గురిపెట్టి విసరబోయాను.

నవ్వు వినిపించి వులిక్కిపడ్డాను.

'ఏం నాయనా? రైలు మీద కోపం వచ్చిందా? రైలు నిన్ను వదిలేసి వెళ్లిందనేనా ఆ కోపం? అర్ధ రాత్రి- చిన్న పిల్లవాడివి- పైగా కాలు కూడా అవుడు- నువ్వు రైలు దిగటం బాగుంది? మీ వాళ్లెవరో, నువ్వు వున్నావో లేదో పట్టించుకోకపోవటం బాగుంది? రైలు తన దోవన తాను పోయినందుకు రాయి విసురుతావూ? భలే భలే...'

నేను అప్పుడు గమనించాను. రైలు కదలిపోయినా అక్కడ యింకా రైల్వే అధికారులు కొందరు వున్నారు. వారిదగ్గర మిణుకు మిణుకుమంటున్న దీపాలు వున్నాయి.

ఆ దీపాల కాంతిలో నేను ఎర్రటి రక్తపు మరకల్ని, అచేతనంగా పడి వున్న వో శరీరాన్ని చూచాను. శరీరం కాదది మాంసపు ముద్ద.

'నాయనా ప్రయాణం చేయటానికి జనానికి రైలు కావాలి. చావటానికి కూడా రైలే శరణ్యం అవుతోంది. యిక నీలాంటి వాళ్ళు రాళ్లు విసరటానికి రైలే చులకనగా దొరికింది. మధ్యలో వుద్యోగం చేయలేక మేం చస్తున్నాం. అదుగో రైలు ఆగింది. మీవాళ్లు నువ్వు లేవని తెల్సుకొని గొల్సు లాగి వుంటారు పద వెళ్దాం'

దోవలో ఆయనను గురించి తెల్సింది. పేరు హనుమంతరావు. పక్క స్టేషన్‌లో ఎ.యస్.యమ్. వుద్యోగం.

'రైలు ఆ ప్రమాదం వల్లే ఆగిపోయిందా? అసలా ప్రమాదం ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? చచ్చిపోయిన వ్యక్తి ఎవరు?' త్రోవలో నా అనుమానాలని ప్రశ్నల రూపంలో వొక్కొక్కటిగా సంధించాను.

'అబ్బాయ్. నీకు చూస్తే నిండా పదేళ్లు లేవు. చీకటి రాత్రి, రక్తం... శవం... భీభత్సాన్ని చూచావు. యింకా ఆ ఘోరాన్ని గురించిన వివరాలు కూడా తెల్సుకోవాలని వుందా? యిప్పుడు బాగానే వుంటుంది. తర్వాత జడుసుకొని బాధలు పడ్తావ్. ప్రమాదం సంగతి మర్చిపో. దాన్ని గురించి ఆలోచించక రామ నామాన్ని జపించుకో. లేకపోతే ఆంజనేయస్వామి మంత్రాన్ని అనుకో'.

మా పెదనాన్నకి నన్ను అప్పచెప్పి స్టేషన్ మాస్టర్ అయన దోవన ఆయన వెళ్లాడు. కానీ నేను ఆ సంఘటనను మర్చిపోలేదు. హనుమంతరావుగారిని కూడా మర్చిపోలేదు. ఆయన మాటలు నాకు ఎప్పుడూ గుర్తొచ్చేవి.

మరో పదేళ్లు గడిచినా ఆనాడు జరిగిన ఘోరం ఏమిటో తెల్సుకోవాలన్న కోరిక, కోరికగానే

వుండిపోయిది. ఆ ప్రమాద విశేషాలు తెల్సుకోవాలన్న తపన మాత్రం చావలేదు. ఏదో అతీంద్రియ శక్తి ఆ ప్రమాద వివరాలు తెల్సుకోమని నన్ను పురికొల్పుతూనే వుంది. కాని వుద్యోగ ధర్మంగా. . ఎక్కడెక్కడో తిరగటమాయె.

రెండు మూడుసార్లు ఆ ప్రాంతాలకు వెళ్ళినప్పుడు హనుమంతరావుగారిని గురించి వాకబు చేసేను. ఆయన ఎక్కడికో బదిలీ అయి పోయాడు. ఏనాడో జరిగిన ఆ ప్రమాదం యొక్క వివరాలు ఎవరూ చెప్పలేకపోయారు. ఎవరికంత తీరిక - వోపిక?

యీలోగా నేను, చచ్చుబడిపోయిన కాలును, ఆపరేషన్‌ద్వారా సరి చేయించుకొన్నాను. ఆర్టిఫిషియల్ ఎముకను లోపల అమర్చటంతో నేను దాదాపు అందరిలాగే నడవగలుగుతున్నాను. పరీక్షగా చూస్తే కుంటితనం కన్పిస్తుంది.

అంగ వైకల్యం దురదృష్టకరమైనదే. కానీ అంతకన్నా దురదృష్టకరమైన విషయమేమంటే, వున్న ఆ అంగవైకల్యాన్ని పదే పదే గుర్తు చేసే జనం సమాజంలో వుండటం. అలా గుర్తు చేసి ఆనందించే వారి మానసిక ఆరోగ్యానికి చికిత్స చేయటం నేను జీవితంలో వో లక్ష్యంగా పెట్టుకొన్నాను. అంగ వికలుల సంఘంలో నాకు ప్రముఖ స్థానం వుంది.

అలా వుండగా పదేళ్ల క్రితం ప్రమాదం జరిగిన ఆ వూరికే నాకు బదిలీ అయింది.

రైలు దిగంగానే హనుమంతరావుని గురించి వాకబు చేసేను.

అదృష్టం ఆయను ఆ స్టేషనుకు మాస్టరు అప్పుడు.

ఆయనకు నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. ప్రమాద వివరాలు అడిగాను.

'యిన్నేళ్ల తర్వాత కూడా నువ్వు ఆ విషయాన్ని మర్చిపోలేదన్న మాట! ఆ వివరాలు తెల్సుకోవాలన్న కోరికను చంపుకోలేదన్న మాట! చిత్రంగా వుందే!

నాకూ అదే చిత్రం! ఆ ప్రమాదానికి, నా జీవితానికి ఏమిటి సంబంధం?

ఏదో సంబంధం లేకపోతే ఆ కోరిక నన్ను ఎందుకు వెంబడించాలి?

మర్నాడు ఆయన నాకు ఆ ప్రమాదం కథను పూస గుచ్చినట్లుగా చెప్పేడు.

* * *

'ఏమిటా కథ? సస్పెన్స్‌తో చంపక త్వరగా చెప్పు అంకుల్'

నేను కథ చెప్పటం ఆపగానే అలా వుంటుందని వూహించాను నేను.

నా వూహ తప్పయింది. చేతన నిశ్శబ్దంగా అలా కూర్చుండిపోయింది.

'ఆ కథను నే ఏ కూడా నీకు రేపే చెప్పనా?

'వద్దు. కథంతా యిప్పుడే చెప్పు. సీరియల్ నవలల్లోలాగా వుత్కంఠను పోషించనక్కర్లేదు అంకుల్ యిది నువ్వు పత్రికకు రాస్తున్న కథ కాదని గుర్తుంచుకో. నా జీవితాన్ని దిద్దే కథ చెప్తున్నావని నేను గ్రహించాను'

నేను కాస్సేపు మౌనంగా వుండి ఆ తర్వాత హనుమంతరావుగారు చెప్పిన ప్రమాదం కథను చేతనకు చెప్పాను క్లుప్తంగా.

★ ★ ★ ★

ఆదినారాయణ తన వొక్కగానొక్క కూతరు ప్రమీలను గొప్పగాయకురాలిని చేయాలని చిన్నతనం నుంచికలలుగన్నాడు. ఆయన స్వయంగా వాయులీన విద్వాంసుడు. కూతురికి తొలి గురువై సంగీతంలో తొలి పాఠాలు చెప్పేడు. ఆ తర్వాత మరో గొప్ప విద్వాంసుడి పాదాల వద్ద కూతుర్ని వుంచుదామని అనుకొంటున్న దశలో ఆయన హఠాత్తుగాచనిపోయాడు.

ఆయన భార్య అరుంధతమ్మ గ్రామంలో యిల్లు గడిచే వసతి లేక పట్నానికి వచ్చి వంటలు చేసి కూతుర్ని పెద్ద చేసింది.

ఆమె ఆరోగ్యపు బండి బోల్తా కొట్టే సమయానికి ప్రమీల సంగీత ప్రపంచంలో చిన్న చిన్న కచేరీలు చేసే స్థాయికి మాత్రమే ఎదిగింది భర్త కోరిక నెరవేరాలంటే ప్రమీల గొప్ప గురువుల వద్ద శిష్యరికం చేయాలి కానీ ఎలా?

ప్రమీల తల్లి చేత వంటలు మాన్పింపచేసి కుటుంబ బాధ్యతను తన నెత్తినెత్తుకుంది. అచిర కాలంలోనే సంగీత పాఠాలు చెప్పే పంతులమ్మగా మంచి పేరు పొందింది డబ్బూ బాగానే వస్తోంది. కానీ తల్లి మందులకే అంతా ఖర్చు.

'సంగీత విద్వాంసురాలిని చేయాలన్న మి నాన్న కోరికను ఎలాగూ తీర్చలేకపోయాను. కనీసం పెళ్లన్నా చేసుకొని నువ్వు పిల్లా పాపల్తో హాయిగా సంసారం చేయాలని తల్లిగా నేను కోరుకోటంలో తప్పు లేదు కదా? 'మరి ఆర్జించినదంతా నా మందులకే పోస్తే నీకు మొగుడెలా వస్తాడమ్మా? కట్నం పోయందే పెళ్లి కాదు కదా?'

'నా పెళ్లి గురించి నువ్వేం దిగులు పడకమ్మా. నేను పెళ్లి చేసుకొంటాను. ఎలాగో లాగు కట్నం లేకుండా చేసుకొనే మగాడినే సంపాదించు కొంటానుగా? నేనేం త్యాగమూర్తిని కానులే. నాకు అందం వుండి మంచి కంఠం వుంది యీ రెంటినీ వుపయోగించి మొగుడిని సంపాదించు కొంటానుగా?'

ఆ ఆత్మ విశ్వాసంతోనే ఆమె రేడియో గాయకురాలయింది.

రేడియోలో ఆమె గాత్రాన్ని విని, ఆ గాత్ర మాధుర్యానికి మురిసిపోయి సుధాకర్ ఆమెకు వుత్తరాల ద్వారా అభిమాని అయ్యాడు ముందు ఆ తర్వాత ఆమెను చూచి ప్రేమికుడుగా మారేడు

'నేనెప్పుడో వో కథ చదివేను ప్రమీలా నాలాగే వో యువకుడు రేడియోలో కంఠ స్వరం విని వొకమ్మాయిని ప్రేమించాడు తీరా వెళ్లి చూస్తే ఆమె కురూపి. శరీర సౌందర్యానికి ప్రాధాన్యతనిచ్చిన ఆ యువకుడు ఆ అమ్మాయి అనాకారిత్వాన్ని అసహ్యించుకొని, దేముడిని నిందిస్తూ వెళ్లిపోతాడు ఆ కథ చదివి రచయిత మనో రుగ్మతకు జాలిపడ్డాను నిన్ను చూచాక ఆ రచయిత వూహ ఎంత విస్పష్టమైనదో యిప్పుడు యింకా బాగా తెల్సి వచ్చింది నీ గాత్ర మాధుర్యం యిలా సంగీత



పాఠాలకు వేస్ట్ కారాదు. ప్రపంచం చేత గుర్తించబడాలి. అందరూ ఆస్వాదించి ఆనందించాలి. నిన్ను పెళ్ళి చేసుకొని నీలోని సంగీత సరస్వతిని ప్రపంచానికి సాక్షాత్కరింప చేస్తాను.'

సుధాకర్ చిత్త శుద్ధితో అన్న మాటలే అవి. అందుకే అతడికి మనసుతో పాటు శరీరాన్ని అర్పించి వేయటానికి సిద్ధ పడింది ప్రమీల.

కానీ సుధాకర్ అందుకు అంగీకరించలేదు.

ప్రమీలను వివాహం చేసుకోటానికి సుధాకర్ తండ్రి అంగీకరించలేదు.

'వంట చేసుకొనేదాని కూతుర్ని చేసుకొంటావా నువ్వు? నువ్వు ఎవరి కొడుకువో , తెల్సుకొనే మాట్లాడుతున్నావా? యీ సుందరరామయ్య...'

సుందర రామయ్యకు చాలా ఐశ్వర్యం వుంది. కానీ అంతకు మించిన అహంకారం వుంది. వంశ, కుల, ధన అహంకారాలు మూర్తీభవించిన వ్యక్తి అతను.

కొడుకు ప్రమీలను ప్రేమిస్తున్నాడని తెల్సేక ప్రమీలకు వూళ్ళో సంగీత పాఠాలు లేకుండా చేసేడు. కడుపు మీద కొడ్తే, మారిన తన కొడుకును కూడా ఆ తల్లీ కూతుళ్ళు విడిచి వెళ్తారని ఆశించాడు.

'మా నాన్న మూర్ఖత్వాన్ని మార్చే శక్తి నాకు లేదు ప్రమీలా. అలాగని నిన్ను వదులుకొనే పిరికివాడినీ కాను నేను. నిన్ను యీ రాత్రికే నేను దైవసాక్షిగా మీ అమ్మగారి సాన్నిధ్యంలో వివాహం చేసుకొంటాను. యీ రాత్రి మనకు తొలి రాత్రి: రేపు రాత్రి మనం స్వేచ్ఛగా యీ వూరి నుంచి ఎగిరిపోయే రాత్రి. పాము పడగ నీడలో వుండటం ప్రమాదం కదా?

ఆ రాత్రే సుదాకర్ యధావిధిగా ప్రమీలను వివాహం చేసుకొన్నాడు. మంగళ సూత్రం... ఫొటో లు... సాక్ష్యాలు... దేన్నీ వదల్లేదు.

ఆ రాత్రి వారిద్దరి జీవితంలో అమృతం కురిసిన రాత్రి.

అయితే తెల్లవారే సరికి ఆ కబురు మెల్లగా సుందరరామయ్యకు తెల్సింది. బుసలు కొట్టేడు. కొడుకు మీద కాదు. కొడుకును 'బుట్ట'లో వేసుకొన్న ప్రమీలపైన.

'నా కొడుక్కి అదేదో మందు పెట్టింది. లేకపోతే నా కొడుకేమిటి? దాని వెంట పడటమేమిటి?' అంటూ ప్రమీలను ప్రపంచం నుంచే తొలగించ టానికి ప్రణాళికలు వేసేడు.

'నువ్వేం భయపడకు ప్రమీలా. కోరి నిన్ను నేను అర్ధాంగిని చేసుకొన్నాను. నీ సుఖంలో, దుఃఖంలో నాకు భాగం వుంది. నీ కష్టాలలో, ఆనందాలలో భాగం వుంది. నిన్ను విడిచి నేను జీవించను. మా నాన్న నన్ను విడిచి నిన్నేం చేయలేడు. కంటికి రెప్ప అడ్డం. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం.'

యిద్దరూ కల్సి బయలుదేరేరు. రహస్యంగా ఆ వూరు విడిచి బయట పడాలని అతని వూహ. కానీ బస్సు డిపోలో, నాలుగు రోడ్ల కూడలిలో, రైలు స్టేషన్‌లో ఎక్కడ చూచినా సుందరరామయ్య పంపిన కిరాయి రౌడీలే.

వారి కన్ను గప్పి పారిపోవటం ఎలా?

## అసురసంతతి

సుధాకర్ వో ప్లేను వేసేడు.

రైలు పట్టాలను పట్టుకొని వాటి వెంట పక్క స్టేషనుకు చేరుకొంటే? అక్కడ రైలెక్కితే ఎవరూ చూడరు కదా? కిరాయి రౌడీలు రోడ్లు కాయవచ్చు. కానీ రైలుపట్టాలను కాయరుకదా?

చీకట్లో ప్రమీలను నడిపించుకొంటూ రైలు పట్టాల వెంట పక్క స్టేషన్‌కు ప్రయాణమయ్యాడు. చీకటి తమకు రక్షగా వుందనుకొన్నాడతను. కానీ ఆ చీకట్లోనే ప్రమాదం పొంచి వుందని అతను వూహించలేదు.

సుందర రామయ్య రైలు పట్టాల మీద కూడా తన మనుషులను కాపుంచాడు.

వారు ప్రమీలను, సుధాకర్‌ను పట్టుకొన్నారు. పట్టుకొని విడదీసేరు.

ప్రమీల నోట్లో గుడ్డలు కుక్కేరు. చేతుల్నీ, కాళ్ళను, ఆమె చీరనే చింపి ఆ పీలికలతో కట్టి వేసేరు.

యింతలో అటు నుంచి దయ్యాల బండి వస్తోంది. పట్టాల మీద పడుకోబెట్టేరామెను.

అక్కడ పట్టాలు వంపు తిరుగుతాయి. ఇంజన్ డ్రయివర్‌కు దగ్గరకొస్తేనే పట్టాల మీద వస్తువు కన్పించదు. అలాంటి చోటును ఎన్నుకొని మరీ ఆమెను పడుకోబెట్టారు.

ప్రమీల రైలు పట్టాల మీద పడుకొని వుంది. అయినా గింజుకోటానికి, రైలు వస్తున్నదని భయపడటానికి ఆమెకు స్పృహ లేదు.

అల్లంత దూరంలో నలుగురు రౌడీల కబంధ హస్తాలలో వుండి సుధాకర్ ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు.

రైలు దగ్గరవుతోంది. సుధాకర్‌లో ఆవేశం, కోపం, దుఃఖం కట్టలు తెంచుకొంటున్నాయి.

మరి కొన్ని నిముషాలలో ప్రమీల రైలుకు ఆహుతి అవుతుంది.

## అనాదిగా ఆడది

నిండు చూలాలై
అడవి పాలైందొకతి
పందెపు పావుగా మారి
నిండు సభలో
అవమానం పాలైందొకతి
సత్యానికి కట్టుబడి
అమ్ముడు పోయిందొకతి
వరకట్నానికి బలియై
అగ్నికి ఆహుతి అవుతుంది
నేటి యువతి
ఏ చరిత్ర నడిగినా
చెపుతుంది
ఆడదాని అధోగతి

—మంతెన విజయలక్ష్మి

తనను నమ్మి ప్రేమించినందుకు ఆమెకు పడుతున్న శిక్ష అది.

ప్రేమకు కత్తిపోట్లా?

రైలు వంకర తిరుగుతోంది. మరి కొన్ని సెకెండ్లలో ప్రమీల అందమైన శరీరం ఆ ఇనుప చక్రాల కింద పడి నలిగిపోతుంది.

సుధాకర్ ఆవేశం కట్టలు తెంచుకొంది. ఆ ఆవేశంలో అతను రౌడీల బంధాన్ని తెంచుకొన్నాడు.

పరుగెత్తేడు.

ప్రమీలా... ప్రమీలా...

పరుగెత్తేడు. రైలుతో పోటీ పడి పరుగెత్తేడు.

పరుగెత్తి రైలును జయించాడు. రైలుకన్నా ముందుగా ప్రమీలను చేరుకొన్నాడు. ఆమెను కప్పి వేస్తున్నట్టు, రక్షిస్తున్నట్టు, ఆమెకు అడ్డుగోడలా ముందు పడుకున్నాడు.

డ్రయివర్ ఆ దృశ్యాన్నంతా చూచాడు. రైలును ఆపాలని ప్రయత్నించాడు. కానీ కాలం అప్పటికే మించిపోయింది.

రైలు సుధాకర్‌ను గుజ్జుగా మార్చింది. కానీ ప్రమీల కాళ్లను మాత్రమే ఖండించగలిగింది.

* * * * * *

హనుమంతరావుగారు చెప్పిన రైలు ప్రమాదం కథ అది.

ప్రేమ కోసం, వైవాహిక బంధం కోసం, వొక ఆదర్శం కోసం అన్న మాటను నిలుపుకోటం కోసం తన ప్రాణాన్ని బలి యిచ్చిన, సుధాకర్ కోసం విచారించాలో ...

లేక-

ప్రేమించిన వ్యక్తిని, మెడలో మంగళసూత్రం కట్టిన భర్తను పోగొట్టుకొని రెండు కాళ్ళు లేని అవిటిదానిలా బ్రతుకు నీడ్చవలసి వచ్చిన ప్రమీల కోసం ఏడవాలో నాకు తోచలేదు.

కానీ అతీంద్రియ శక్తి యిన్ని సంవత్సరాలుగా నన్ను ఆ ప్రమాదం గురించి తెల్సుకోమని ప్రోత్సహించిందో నాకు అర్ధమయింది.

నేను పుట్టు కుంటి వాడిని. ప్రమీల రాక్షస రీతిలో కుంటిది చేయబడింది.

ప్రమీల జీవితంతో నాకున్న అనుబంధం అది. ఆమే జీవిత కథ పట్ల నా వుత్సుకత యిప్పుడు మరింత పెరిగింది.

'యిప్పుడు ఆమె ఎక్కడున్నారుసార్. ఆ తర్వాత ఆమె కథ ఏమయింది?'


'ఏమవుతుంది సాయనా కూతురు జీవితానికి పట్టిన గతి చూచి తల్లి గుండెచెదిరి కన్ను మూసింది. ప్రమీల మానసిక రుగ్మతతో పిచ్చాసుపత్రి చేరింది.

'కాళ్ళు లేవు. మతి స్థిమితం లేదు. నా అన్న వారు లేరు. డబ్బూ లేదు. యిక ఆమెనెవరు ఆదరిస్తారు?అలా వుండగా ఆమె గర్భవతి అని తేలింది.

పుట్టిన పిల్లను అనాధాశరణాలయానికి పిచ్చాసుపత్రి వారే చేర్చారు.

అంత వరకే నాకామె కథ తెల్సు. ఆ తర్వాత నాకు

# గడుసులోకం —బాబు




బదిలీలు కావటం... ఎక్కడెక్కడో తిరగటం... ఆమె విషయమే మర్చిపోయాను. మళ్లీ యిన్నాళ్లకు నీద్వారా ఆ కథంతా మననం చేసుకొన్నాను' హనుమంతరావుగారు అన్నారు.

ఆ తర్వాత నేను నాకున్న పలుకుబడినంతా వుపయోగించి ప్రమిలకు సంబంధించిన ఎన్నో విషయాలు తెల్సుకొన్నాను. పిచ్చాసుపత్రికి వెళ్లి ఆమెన కలిసేను.

జీవచ్ఛవం... మురికి మనిషి... పిచ్చి వేషం... యిలాంటి ఎన్నో పదాలు అన్నీ కూడా ఆమె స్థితిని వర్ణించటానికి చాలవు.

మానసికంగా, శారీరకంగా చితకగొట్టబడిన వ్యక్తి ఆమె.

వో గొప్ప కళాకారిణి కావల్సిన ఆమె జీవితం యిలా ముగిసిపోవల్సిందేనా? నో... నో నో...

పిచ్చాసుపత్రిలో ఆమెను చేర్చటం పెద్ద పొరపాటు. ఆమెను అక్కడి నుండి విడుదల చేయించి అంగ వికలుర గృహానికి చేర్పించాను. శారీరకంగా, మానసికంగా ఆమె కొంత కోలుకోటానికి చికిత్స చేయించాను. ఆ తర్వాత ఆమెలో ఆత్మ విశ్వాసాన్ని పెంచటానికి మార్గాల నన్వేషించాను.

'మీరు వొక బిడ్డకుతల్లి. ఆ బిడ్డ కోసమన్నా మీరు తిరిగి మామూలు వ్యక్తి కావాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని జీవితంతో పోరాడి గెలవాలి'.

ఆమె పిచ్చి క్రమంగా తగ్గింది. సుధాకర్‌ను గురించి అస్తమానం పలవరించటం మానింది.

ఆమెకు రెండు కృత్రిమ కాలులను ఏర్పాటు చేయించాను. ఆ కాళ్లతో ఆమె నడవసాగింది.

'మిమ్మల్ని వుత్తమ గాయకురాలిగా చేయాలని సుధాకర్ కలలుగన్నాడు. మీరు పట్టుదలతో ఆ స్థాయిని సాధించి అతని కలల్ని నెరవేర్చాలి'.

'వద్దు. నా గానమాధుర్యమే అతడిని ఆకర్షించింది. అతని ప్రాణం బలి కావటానికి కారణభూతమయింది. ఆ గుర్తులు మర్చిపోవాలి.

## అసురసంతతి

మామూలు జీవితం చాలు నాకు. బ్రతుకు తెరువు చూపించండి. నా బిడ్డను తెచ్చుకొంటాను'

నేను ఆమెను ఆ వూరికి తీసుకొచ్చాను. ఆమె కొసం వుద్యోగాన్వేషణలో పడ్డాను. అదే నేను చేసిన పెద్ద పొరపాటు.

మనుష్యుల్లో పశు ప్రవృత్తిగలవారు వుంటారని నాకు తెల్సు. రాక్షస గుణాలు వున్నవారు కూడా వుంటారని తెల్సు. కానీ పశువులకన్నా, జంతువులకన్నా రాక్షసులకన్నా ప్రమాదకరమైన జాతి వొకటి వుంది.

ఆ జాతి వారిది రజో ప్రవృత్తి. అన్ని విషయాల్లో మామూలుగానే నవ్విస్తారు. కానీ తమ అహంకారానికి- ఇగో- కి దెబ్బ తగిలితే మాత్రం- తామన్నా సర్వ నాశనం అవుతారు ప్రత్యర్థులనన్నా సర్వ నాశనం చేస్తారు. రావణాసురుడి సంతతివారు వారు దుర్యోధనుడి సోదరులు వారు సుందర రామయ్య ఆ కోవకు చెందినవాడే.

తన కొడుకు చావుకు కారణభూతురాలైన వో అర్భకురాలైన స్త్రీ- రెండు కాళ్ళు పోగొట్టుకొని కూడా పచ్చగా తిరగటమా?

ప్రమిలకు వుద్యోగం కూడా సంపాదించగలిగేను.

ఆ రోజు కను చీకటి పడ్డాక ప్రమిల వుద్యోగం చేసే చోటి నుంచి యింటికి తిరిగివస్తోంది. యిప్పుడు ఆమెను రెండు కాళ్ళు లేని వ్యక్తి అని ఎవరూ అనుకోలేరు. అంత సహజంగా నడుస్తుంది.

యింటికి దగ్గర కాబోతుండగా సుందరరామయ్య కిరాయి మనష్యులు నలుగురు ఆమెను చుట్టు ముట్టేరు 'క్రింద పడేసేరు కృత్రిమంగా అమర్చబడ్డ కాళ్లను లాగి పారేసేరు. పక్కనే వున్న వో పాడుబడ్డ యింట్లోకి తీసుకెళ్లారు. అరవకుండా నోట్లో గుడ్డలుకుక్కారు.

రాక్షస నృత్యం- కృత్యం- ఆరంభమయింది.

తెల్లవార్లూ ప్రమిల కోసం నేను వూరంతా తిరిగేను.

తెల్లారేక చూస్తే చావు బ్రతుకుల్లో, కొట్టుమిట్టాడుతూ ఆమె నా యింటి ముంగిటేపడి వుంది. వొళ్లంతా రక్కులు- గాయాలు... రక్తం...

జరిగింది. గ్రహించగలిగేను నేను. అయినా చనిపోయే ముందు ప్రమిలే స్వయంగా జరిగిన రాక్షస నృత్యాన్ని చెప్పింది.

'నా కూతుర్ని యీ అసుర సంతతి నుంచి- రాక్షస గుణం నుంచి దూరంగానే వుంచండి. నా కూతురని దానికిగాని, లోకానికిగాని తెలియనివ్వకండి. దానికిక తల్లీ తండ్రీ తోడూ నీడా అన్నీ మీరే

ప్రమిల ఆఖరి వాక్యాలు అవే.

*　　*　　*　　*　　*　　*

కొన్నేపు భయంకర నిశ్శబ్దం ఆవహించింది. చేతనే దాన్ని ఛేదించింది.

'అంకుల్. మీరీ కథ నాకెందుకు చెప్పేరో నార్థమయింది. అసురుల అహంకారం చేత సర్వాన్ని కోల్పోయిన ప్రమిల అనే ఆ స్త్రీ మూర్తి నా తల్లేనని తెలుస్తోంది. కానీ చందూకి ఆ సుందర్రామయ్య ఏమవుతాడు?'

నేను మౌనంగా చందూను గురించిన వివరాలున్న కాగితాన్ని ఆమెకిచ్చాను.

ఆమె అవి చదివి వులిక్కిపడింది. చందూవద్దకు బయలుదేరింది.

*　　*　　*　　*　　*　　*

తన వివరాలంటూ చేతన యిచ్చిన వివరాలు చదివి కొయ్యబారిపోయాడు చందూ.

'చందూ, నేను నిన్ను వివాహం చేసుకోనని వేరే చెప్పనక్కర్లేదు నేను దైవ సంతతికి చెందినదాన్ని. నువ్వు అసుర సంతతికి చెందినవాడివి. దేవతల్లో చెడ్డవారు, అసురుల్లో మంచి వారు వుండవచ్చు. కానీ వొకరు సత్వ గుణాన్ని, మరొకరు రజో గుణాన్ని పెంచుకొనే తత్వం కలవారు. కనుక వారి మధ్య స్పర్థ

తప్పదు. స్నేహం కుదరదు. దట్సాల్'.

'వొక్క నిముషం ఆగు చేతనా. నా తాత చేసిన తప్పుకు నన్ను దండించటం నీకు సబబా? నా తాత 'అసుర సంతతివాడనయినంత మాత్రాన నేనూ కావాలని వుందా? అలా అనుకొంటే నీ తండ్రి- అదే మా మామయ్య సంగతేమంటావ్?

అతడామెను ఆపి బ్రతిమిలాడి లోపలికి తీసుకెళ్లాడు.

పెద్ద యిల్లు. అయితే చేతన వూహించినట్లు ధనాహంకారం తాండవించటం లేదాయింట్లో, యిల్లు దాటి దొడ్లోకి వో చిన్న గది వద్దకు తీసుకెళ్లాడతను.

'నీ పగకు కారణభూతుడైనా ఆ అసురుడి గతి చూడు చేతనా'.

మురికి కూపం లాంటి గది. దుర్గంధం. అందులో వో కుక్కి మంచంలో ఎముకల పోగులాంటి మనిషి కుళ్లిపోయి కంపు కొడు_తున్న శరీరాన్ని భరిస్_తున్న వో జీవి.

'స్వర్గం, నరకం ఎక్కడో లేవు చేతనా యిక్కడే వున్నాయి మన మనసుల్లోనే వున్నాయి. తాతయ్య స్వర్గ సుఖాలు ఏం అనుభవించాడో నాకు తెలియదు. కానీ చాలా సంవత్సరాలుగా ఆయన ఆ యమకూపంలో అలాగే మగ్గిపోతున్నాడు. తను చేసిన పాపాలకు ఆయన యీ లోకంలోనే అనుభవిస్_తున్న శిక్ష ఏమో అది.'

జాలి వేసింది చేతనకు. కంటి వెంట రాలబోయిన అశ్రు బిందువును బలవంతంగా ఆపుకొంది. సగటు భారతీయ స్త్రీ కాకూడదు తాను! ఆవేశాన్ని తెచ్చుకొంది.

'సుందర రామయ్యా, నేనెవరినో తెల్సా? నీ కొడుకు సుధాకర్ కూతురిని. నువ్వు నానా హింసలు పెట్టి చంపిన ప్రమీలాదేవి కూతురిని. నీ మనువడు నన్ను పెళ్లి చేసుకొంటానని ప్రాధేయపడు_తున్నాడు. నీ కుటుంబంలో పుట్టి పెరిగిన కారణంగా అతడిని తిరస్కరిస్_తున్నాను. నువ్విలాగే యింకా చాలా కాలం కుళ్లి కుళ్లి చావాలి నన్ను నేను క్షమించను.' సుందరరామయ్య వద్దకు ముక్కుకు గుడ్డ అడ్డం పెట్టుకొని వెళ్లి అరిచి చెప్పింది.

అతడిని హింసించి ఆనందిద్దామనుకొన్న ఆమె కోరిక తీర లేదు. ఎముకలపోగు మొహంలో మార్పే లేదు.

'లాభం లేదు చేతనా, ఆయనకు వినిపించదు, కన్పించదు, మాట లేదు.'

యిక అక్కడ నిలవలేనట్లు చేతన గిరుక్కున వెనక్కి తిరిగి బయటికొచ్చింది. నన్ను చూచి కొయ్యబారిపోయింది!

'నీతో బాటు అంతా చూచానమ్మా, విన్నాను.

దేవతలు, అసురులు అనేవారు ఎక్కడో వుండరు. మనుష్యుల బుద్ధులలోనే వుంటారు. మనుష్యులందరూ సత్వ రజస్ తమోగుణో పేతులే. యీ త్రిగుణాల నిష్పత్తులనుబట్టి, మనుషులు, దేవతలుగా, అసురులుగా, రాక్షసులుగా మారుతుంటారు. సుందరరామయ్యది అసుర ప్రవృత్తి. భస్మాసుర హస్తంలా అతడి అహం యితరులని నాశం చేసింది అతడినే దహించి వేసింది. అసుర సంతతికి చెందిన వాడన్న అపోహతో మంచి మనసున్న చందూను శిక్షించి మరో అసురుడుగా అతడిని మార్చటం మంచిది కాదేమో! అన్ని శక్తులలోకీ క్షమా శక్తి ఉత్తమమైనది. ఆలోచించు'

చేతన ఆగింది వెనక్కి తిరిగింది.

చందూ వైపు చూస్తూ ఆలోచించసాగింది ☐

# "ఆచూకీ"

రోజులు తరుగు తున్నాయ్–
నెలలు కరుగు తున్నాయ్–
ఏడాదులు దాటు తున్నాయ్–
పెరుగుతున్న
చరిత్ర పేజీల్లో
మాత్రం–
"మానవత" జాడ
కనిపించటమే లేదు!

–ఈతకోట సుబ్బారావు

–కోలపల్లి ఈశ్వరరావు

